మట్టిగణపతుల పంపిణీ

బంజారాహిల్స్/యూసుఫ్‌గూడ/పంజాగుట్ట/బేగంపేట/సనత్‌నగర్/ఎర్రగడ్డ, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): మట్టి వినాయకులను పూజించాలని సినీనటుడు తనికెళ్ల భరణి సూచించారు. కృష్ణానగర్‌కు చెందిన వాసవీ యువజన సేవా సంఘం ప్రతినిధులు తనికెళ్ల భరణి, నటుడు నిఖిల్‌కు మట్టి విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా తనికెళ్ల భరణి మాట్లాడుతూ మట్టి విగ్రహాలపై ప్రజల్లో మంచి అవగాహన వచ్చిందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కారణంగా సరస్సులు కాలుష్యం అవుతాయన్న విషయంపై మరింత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఫిలింనగర్ మురికివాడల్లో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, వెంకటగిరిలో వెంకటగిరి యూత్ అసోషియేషన్ గణపతి మండపం వద్ద సంస్కృతి కిడ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ సంతోష్ కుమారి, సిబ్బంది వరలక్ష్మి, రాణి మట్టిగణేశలను పంపిణీ చేశారు. యూత్ అసోషియేషన్ సభ్యులు, బీజేపీ నాయకులు పులిరామ్, బరిగెల జ్ఞానేశ్వర్, బడుగు సతీష్, రామ్మోహన్ విద్యార్థులకు మట్టి గణపతులను అందజేశారు. మధురానగర్‌కాలనీలోని సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాల్లో కాలనీ అధ్యక్షుడు ఎం.ప్రతాప్‌రెడ్డి, వెంగళరావునగర్‌కాలనీలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి, బీజేపీ సెంట్రల్ జిల్లా మైనారిటీ మోర్చా ఉపాధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ జబ్బార్, బేగంపేటలో కార్పొరేటర్ టి.మహేశ్వరి, బీఆర్ఎస్ నాయకుడు టి.శ్రీహరి, జీహెచ్ఎంసీకి చెందిన కృష్ణ, సనత్‌నగర్ నియోజకవర్గం తులసినగర్‌లో టీడీపీ నాయకులు కానూరి జయశ్రీమల్లేష్, శ్రీపతి సతీష్‌కుమార్, బోనాల శ్రీనివాస్‌గౌడ్, ప్రసాద్, తిరుపతినాయుడు, జ్యోతి, దేవి, పుణ్యకుమారి, హేమవతినగర్ చౌరస్తాలో నగర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దూడల రవిగౌడ్, ఎర్రగడ్డ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఎర్ర కృష్ణ కుమార్ మట్టిగణపతులను పంపిణీ చేశారు.



సినీనటుడు, రచయిత తనికెళ్ల భరణికి మట్టి గణపతిని అందజేస్తున్న కృష్ణానగర్ వాసవీ యువజన సేవా సంఘం ప్రతినిధులు



హీరో నిఖిల్‌కు మట్టిగణపతిని అందజేస్తున్న వాసవీ సేవా సంఘం సభ్యులు

ఆకాశాన్నంటిన ధరలు

వినాయక మండపాలు, ఇళ్లల్లో చేసే డెకరేషన్లకు ఉపయోగించే బంతి, చామంతి పూల ధరలు ఆకాశాన్ని అంటాయి. మామూలు రోజుల్లో రూ. 30 నుంచి రూ.40 కిలో ఉండే బంతి, చామంతి పూలు ఇప్పుడు రూ. 100 నుంచి రూ. 150 పలుకుతున్నాయి. మిగతా పూల ధరలు, వినాయకుడి పూజ కోసం ఉపయోగించే పత్రాలు, ఫలాల ధరలు కూడా అధికంగానే పలికాయి.

గణపతి చెంత రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ భారీ గణపతి వద్ద ఎలాంటి రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయకూడదనే హైకోర్టు ఉత్తర్వులను ఇక్కడ పాటించడం లేదు. గణపతి వద్దకు వచ్చే మార్గంలో చాలా మంది రాజకీయ పార్టీల నాయకులతో పాటు వారి ఫొటోలతో కూడిన స్వాగత ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే దానం, ఉత్సవ కమిటీ ప్రతినిధులు

ఖైరతాబాద్ గణపతి వద్ద ఏర్పాట్ల పరిశీలన

ఖైరతాబాద్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ సప్తముఖ మహాశక్తి గణపతికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో పాటు ప్రముఖులు పూజలు చేయనుండడంతో ఏర్పాట్లను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శుక్రవారం పరిశీలించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు, పోలీసులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు రాజ్‌కుమార్, సందీప్‌రాజ్, మాజీ కార్పొరేటర్ జి.కృష్ణయాదవ్, రాంరెడ్డి, అశోక్, లక్ష్మణ్‌యాదవ్, మహేందర్‌బాబు, మహేష్‌యాదవ్, చందు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న పంజాగుట్ట ఏసీపీ మోహన్ కుమార్

పంజాగుట్ట, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాలు సజావుగా జరిగేలా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పంజాగుట్ట ఏసీపీ ఎస్. మోహన్ కుమార్ సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో పంజాగుట్ట, మధురానగర్ పోలీస్‌స్టేషన్ల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది నిరంతరం నిఘా పెట్టాలని ఆయన సూచించారు. సమావేశంలో పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ శోభన్, డీఐ శ్రావణ్ కుమార్, ఎస్ఐలు శివశంకర్, వెంకటకిషన్, ప్రదీప్, వేణుగోపాల్, మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీఐ రవికుమార్, ఎస్ఐలు బాలరాజు, సాయినాథ్‌రెడ్డి, అవినాష్, సిబ్బంది పాల్గొన్నారు.

మండపాల వద్ద విద్యుత్ భద్రతా చర్యలు పాటించాలి

● టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): గణేశ్ మండపాలకు నిరంతరాయ విద్యుత్‌సరఫరా అందించాలని, మండపాల్లో భద్రత చర్యలు పాటించేలా నిర్వాహకులకు సూచించాలని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్ దక్షిణ తెలంగాణ విద్యుత్‌పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆపరేషన్స్ డైరెక్టర్ డా.నర్సింహులు, చీఫ్ ఇంజనీర్స్ పి.ఆనంద్, కె.సాయిబాబా, ఎస్ఈలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేశ్ మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ కల్పిస్తుందన్నారు. విద్యుత్‌సిబ్బంది, సెక్షన్ అధికారులు తమ పరిధిలో ఏర్పాటు చేసిన మండపాలను సందర్శించి, విద్యుత్‌పరంగా ఎలాంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. మండపాల వద్ద విద్యుత్ భద్రతా చర్యలు పాటించాలన్నారు. శుక్రవారం రాత్రి ఖైరతాబాద్ మహాగణపతి వద్ద విద్యుత్‌శాఖ ఏర్పాట్లను సీఎండీ పరిశీలించారు. 11 రోజుల పాటు మహాగణపతి సమీప ప్రాంతాల్లో అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

సూచనలు ఇవే..

- 24 గంటలు అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడ మండపాలకు విద్యుత్ సరఫరా కనెక్షన్ కోసం సామాన్యులు స్తంభాలు ఎక్కరాదు. సంస్థ సిబ్బంది ద్వారానే విద్యుత్‌కనెక్షన్ తీసుకోవాలి.
- ఐఎస్ఐ మార్క్ కలిగిన ప్రామాణిక విద్యుత్‌వైర్లు మాత్రమే వాడాలి, ఎలాంటి జాయింట్ తీగలు వాడరాదు.
- లోడ్‌కు తగినట్లుగా కెపాసిటీ కలిగిన ఎంసీబీ తప్పనిసరిగా వాడితే ప్రమాదాల నుంచి రక్షణగా ఉంటుంది.
- విద్యుత్ వైరింగ్‌లో లోపాలు, లూజు కనెక్షన్లు ఉంటే వర్షాలు పడినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలుంటాయి. నిర్వాహకులు రోజు వైరింగ్ తనిఖీ చేసుకోవాలి.
- విద్యుత్ లైన్లు తెగిపడితే, ఇతర అత్యవసర పరిస్థితుల్లో 1912/100, సమీప ఫ్యూజ్ ఆఫ్‌కాల్‌కు ఫోన్ చేసి విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.

పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుల నియామకం



శ్రావణ్‌కుమార్‌రెడ్డి, చక్రారెడ్డి

ఖైరతాబాద్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్(పీఆర్‌టీయూ) అసోసియేట్ అధ్యక్షులుగా ఎం.శ్రావణ్‌కుమార్‌రెడ్డి, కె.చక్రారెడ్డిలను నియమించారు. వీరికి తెలంగాణ అధ్యక్షుడు గార్లపాటి దయాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్వత సత్యనారాయణ నియామకపత్రాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్‌రెడ్డి, చక్రారెడ్డి మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన దయాకర్‌రెడ్డి, సత్యనారాయణ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటరెడ్డి, ప్రధానకార్యదర్శి బి.రత్నాకర్, వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

జన్యుపరమైన సమస్యలకు సాంకేతికతతో పరిష్కారం

● డాక్టర్ జీవీ ప్రసాద్

బంజారాహిల్స్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని పాత్‌కేర్ సంస్థ అధినేత ప్రముఖ డాక్టర్ జీవీ ప్రసాద్ అన్నారు. గతంలో సాంకేతిక పద్ధతులు అందుబాటులో లేక జన్యుపరమైన సమస్యలతో చాలామంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని, ప్రస్తుత టెక్నాలజీతో గర్భస్థ శిశువులో ఉండే జన్యుపరమైన లోపాలను కూడా గుర్తించే అవకాశం లభించిందని అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లో పాత్‌కేర్ సంస్థ నూతనంగా అందుబాటులోకి తీసుకొచ్చిన పాత్‌కేర్ లైఫ్ సైన్సెస్ సేవలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎంతోమంది శిశువులు జన్యుపరమైన సమస్యలతో జన్మించి చనిపోయేవారని, నేడు తల్లిగర్భంలో ఉన్నప్పుడు ఆ సమస్యను గుర్తించి తగిన వైద్యం అందించే అవకాశాలు పుష్కలంగా వచ్చాయని అన్నారు. తమ సంస్థ తెలంగాణ వ్యాప్తంగా 56 ల్యాబ్‌లను ఏర్పాటు చేసిందని, నగరంలో రెండు ల్యాబ్‌లు సేవలందిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జి.నందినిప్రసాద్, అనిల్ సుంకర, డాక్టర్ రక్షిత్, డాక్టర్ పునీత్, డాక్టర్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యకు ప్రాధాన్యం కల్పించాలి

● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యనందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఐసీడీఎస్ అనుబంధ విభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో పిల్లల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను నిబద్ధతతో చేపట్టి హాజరుశాతం పెంచాలని, వారికి బలవర్ధకమైన ఆహారం అందించాలని, ఎత్తుకు తగిన బరువు ఉండేలా చూడాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని, వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి పిల్లలకు 11 రకాల వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పిల్లల రక్షణ కేంద్రాల్లో నిరంతరం పర్యవేక్షణ చేయాలని, పోషణ లోపం, అతి పోషణలోపం ఉన్న పిల్లలను గుర్తించి సంబంధిత యాప్‌లో వివరాలను నమోదు చేయాలని అన్నారు. జిల్లాలో సఖి కేంద్రాన్ని త్వరితగతిన పూర్తి చేసి దసరా వరకు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం 'పోషణ్ అభియాన్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి అక్కేశ్వర్‌రావు, సీడీపీఓలు, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



'పోషణ్ అభియాన్' పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ తదితరులు



టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను శాలువాతో సత్కరిస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు

● బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

మలబార్ గోల్డ్ షాప్‌లో చోరీ

● బంగారు గొలుసు అపహరణ

పంజాగుట్ట, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): సోమాజిగూడ మలబార్ నగల దుకాణానికి టిప్ టాప్‌గా వచ్చిన ఓ జంట సిబ్బంది కళ్లుగప్పి రూ.3.58 లక్షల విలువ చేసే బంగారు గొలుసును కాజేసింది. అసలు గొలుసు స్థానంలో తక్కువ బరువు ఉన్న నకిలీ గొలుసును పెట్టి అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 21న మలబార్ నగల దుకాణానికి ఓ యువతీయువకుడు వచ్చారు. బంగారు గొలుసు కావాలని అడిగారు. దుకాణం సిబ్బంది వారికి వివిధ శ్రేణుల్లో బంగారు గొలుసులు చూపించారు. సిబ్బంది దృష్టి మరల్చి సుమారు రూ.3.58 లక్షల విలువ చేసే 47.86 గ్రాముల బంగారు గొలుసును దొంగిలించారు.దాని స్థానంలో తమ వద్ద ఉన్న 27 గ్రాముల గొలుసును పెట్టి హడావుడిగా అక్కడి నుంచి వెళ్లిపోయారు. గత నెల 27న షోరూంలోని అన్ని నగల ఆడిటింగ్ నిర్వహించగా బంగారు గొలుసు బరువులో తేడా వచ్చింది. దీంతో సిబ్బంది సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. 21న వచ్చిన యువతీ యువకుడు బంగారు గొలుసు కొట్టేసి దాని స్థానంలో తక్కువ బరువు ఉన్న గొలుసు పెట్టినట్టు గమనించారు. చివరికి శుక్రవారం షోరూం హెడ్ అలీ రిజాయ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'గురుకులాల మూసివేతకు ప్రభుత్వం కుట్ర'



సేవ్ గురుకులాలు అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న స్వేరోస్ నెట్ వర్క్, అనుబంధ సంఘాల నాయకులు

పంజాగుట్ట, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సామాన్యులకు గురుకుల విద్యను దూరం చేయాలని, గురుకుల వ్యవస్థను మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని స్వేరోస్ నెట్‌వర్క్ అనుబంధ సంఘాల నాయకులు ఆరోపించారు. ఎస్సీ గురుకుల వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణిని వెంటనే తొలగించాలని, ఇటీవల తొలగించిన ఆరు వేల మంది టీచర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నర్సయ్య, కన్వీనర్ సీహెచ్ సదానందం, తెలంగాణ గిరిజన గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బానోతు రాంబాబు నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ తదితరులు మాట్లాడారు. స్పోర్ట్స్ అకాడమీని కొనసాగించాలని, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ గురుకులాల్లో బ్రహ్మకుమారి ఆధ్యాత్మిక సంస్థచే సైకాలజీ తరగతులు నిర్వహించాలనే ఒప్పందాన్ని రద్దు చేసి అర్హులైన సైకాలజిస్టులను నియమించి వారితో క్లాసులు చెప్పించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు పి.లలితారాణి, గడప రాజు, ప్రకాష్, అనుదీప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యల పరిష్కారానికి ఒత్తిడి తేవాలి

బంజారాహిల్స్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని గురుకుల తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధులు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగను కోరారు. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మందకృష్ణమాదిగ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాటూరి రమేష్, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు మోహన్ భూపతి, సభ్యులు నరేష్, సుంకనూరి వెంకటేష్, నర్రా ప్రవీణ్, గోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



మందకృష్ణమాదిగను కలిసిన గురుకుల విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధులు



ఓపెన్ నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

ప్రజల సమస్యలను పరిష్కరిస్తా

● కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. శుక్రవారం కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వార్డ్-7లోని గంగయ్య బట్టీ, ఎస్సీ కాలనీలలో పాదయాత్ర నిర్వహించి స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. గంగయ్య బట్టీలో ఓపెన్ నాలా నుంచి మురికి నీరు సరిగ్గా వెళ్లడం లేదని బస్తీలో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు కృషి చేయాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే సంభందిత అధికారులకు ఫోన్ చేసి సూచించారు. యుద్ధ ప్రాతిపదకన సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎస్సీ కాలనీ లో సైతం సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మహంకాళి దేవాలయం కమిటీ అధ్యక్షుడు మురళీ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోష్, శ్రీను, సాయి కుమార్, సుధీర్ కుమార్, సునీల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి సాక తీసుకువెళ్తున్న కోట నీలిమ తదితరులు

అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి చెందాలి

● రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి కోట నీలిమ

సికింద్రాబాద్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి చెందాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి కోట నీలిమ ఆకాంక్షించారు. ఇటీవల జరిగిన ఆషాడ మాస బోనాల జాతరలో భాగంగా భవిష్యవాణి ఆదేశించిన మేరకు శుక్రవారం ఉజ్జయినీ మహాకాళి అమ్మవారికి సాకలు సమర్పించారు. ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ సాకలు సమర్పించే కార్యక్రమం శుక్రవారంతో ముగిసినట్టు తెలిపారు. మహాకాళి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభం చేకూరాలని అన్నారు. ఆలయ ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి, సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్‌కుమార్, సీనియర్ నాయకులు గంటా సుధీర్, శ్రీకాంత్‌చారి, హేమంత్‌సింగ్, మహేష్, నాగరాజు, ఎం.పి.సునీల్, పిట్ల శ్రీశైలం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య శిబిరాన్ని సందర్శించిన ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ సక్కుబాయి

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త వహించాలి

పద్మారావునగర్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, దానికోసం ప్రజలు తగిన జగ్రత్తలు వహించాలని సీతాఫల్‌మండి క్లస్టర్ ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ సక్కుబాయి అన్నారు. డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం దృష్ట్యా బోయిగూడ ఐడీహెచ్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు డాక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సక్కుబాయి మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, అనారోగ్యం బారిన పడితే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాలో సంప్రదించి అవసరమైన చికిత్సను పొందాలని తెలిపారు.



బోనాల జాతరకు దేవాలయాలకు ఇచ్చిన ఆర్థిక సహాయం కంటే ఖర్చు అధికంగా అయిన కొని దేవాలయాలకు ఎంపీ లాడ్స్ నిధులు, దేవాదాయ శాఖ ఆర్థిక సహాయం చేసిన చెక్కులను పంపిణీ చేస్తున్న రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్ -రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి

పూర్ణ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికురాలి నగలు చోరీ

● సికింద్రాబాద్‌లో ఫిర్యాదు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణిస్తున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును ఓ దుండగుడు తెంపుకుని పారిపోయిన ఘటన పూర్ణ రైల్వేస్టేషన్‌లో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ కొంపల్లిలో ఉంటున్న భూపేంద్రసింగ్‌తో పాటు భార్య రక్షరాజ్ పురోహిత్ సొంతూరుకు వెళ్లి ఈ నెల 4న సికింద్రాబాద్‌కు వచ్చేందుకు కాచిగూడ స్పెషల్ రైలులో ప్రయాణం చేస్తుంది. పూర్ణ రైల్వేస్టేషన్ వద్ద ఆమె మెడలో ఉన్న 2.5 తులాల బంగారు గొలుసును గుర్తుతెలియని ఆగంతకుడు తెంపుకుని పారిపోయాడు. వెంటనే బాధితురాలు 139కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. సికింద్రాబాద్‌కు చేరుకున్న బాధితురాలు జీఆర్‌పీ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నాందేడ్ జీఆర్‌పీ పోలీసులకు బదిలీ చేస్తున్నట్లు సికింద్రాబాద్ రైల్వే పోలీసులు తెలిపారు.

అంతర్రాష్ట్ర మహిళల ముఠా అరెస్టు

● రైళ్లలో ప్రయాణికులే టార్గెట్, ఆదమరిస్తే కొట్టేసుడే

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో ప్రయాణికులను టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ఏడుగురు మహిళల ముఠా సభ్యులను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మధ్యప్రదేశ్‌కు చెందిన అంజలి(28), డాలీ(36), జయశ్రీ(30), సవితా బాయి(30), సునీత (30) పుతిలీబాయి(60), డొంగా(35) స్థానికంగా వీరంతా కూలిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరు ఒక ముఠాగా ఏర్పడి రైళ్లలో ప్రయాణికుల్లా నటిస్తూ చోరీలకు పాల్పడుతున్నారని విచారణలో వెల్లడైంది. రైళ్లలో జనరల్ టికెట్లు తీసుకుని ఆదమరిచి పడుకుంటున్న ప్రయాణికులను గుర్తించి ఏ వస్తువు దొరికితే అది చోరీ చేసి మరో బోగిలోకి వెళ్లిపోతారు. గత ఏడాది జూలైలో మచిలీపట్నం రైలులో ప్రయాణం చేస్తున్న రవీందర్ జేబులో రూ. 61 వేలు కనిపించకపోవంతో సికింద్రాబాద్‌లో రైలు దిగిన బాధితుడు సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నేరాలకు పాల్పడుతున్న దొంగలపై సికింద్రాబాద్ రైల్వే పోలీసులు నిఘా ఉంచారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో శుక్రవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న ఈ ముఠా సభ్యులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. నిందితుల నుంచి కేవలం రూ.10 వేలు మాత్రమే రికవరీ చేయగలిగారు. నిందితురాళ్లను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న డీసీ సమ్మయ్య



లాల్లాకలోని లక్ష్మీగణపతి ఆలయంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

మారేడుపల్లి, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితం కోసం మట్టి గణపతులను పూజించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయం వద్ద మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నార్త్ జోన్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, నాయకులు నర్సింహ, బలరాం తదితరులు ఉన్నారు.

చిలకలగూడలో

బౌద్ధనగర్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి గణపతులను శుక్రవారం చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయం వద్ద టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ భక్తులకు పంపిణీ చేశారు.

● చిలకలగూడ పార్క్ అసోసియేషన్, వారాసిగూడ మేరుసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

తిరుమలగిరిలో

తిరుమలగిరి సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకులను మాత్రమే పూజించాలని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె. నరసింహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం బొల్లారంలోని డౌటన్ బజార్‌లో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.

మట్టి గణపతినే పూజించాలి

అడ్డగుట్ట, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): మట్టి గణపతినే పూజించాలని సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ అడ్డగుట్ట డివిజన్ ఏరియా సూపర్ వైజర్ జబ్బార్ సూచించారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో వార్డు కార్యాలయంలో బస్తీ వాసులకు ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.



చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయం వద్ద మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్



చిలకలగూడ పార్కు వద్ద భక్తులకు మట్టిగణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ హేమ

నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలులో నగల దోపిడీ కేసు..

ఒకరి అరెస్ట్.. 30 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలులో జరిగిన నగల చోరీ కేసులో ఒకరిని అరెస్ట్ చేయగా మరొకరు పరారీలో ఉన్నాడని సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ జావెద్ తెలిపారు. శుక్రవారం సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన డీఎస్పీ జావెద్, సికింద్రాబాద్ జీఆర్‌పీ సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ హైదరాబాద్ నాగోల్ ప్రాంతానికి చెందిన ఎన్‌వి రవి వంకర్ శర్మ కుటుంబ సమేతంగా ఫిబ్రవరి 28న వివాహానికి విశాఖపట్నం వెళ్లి వస్తుండగా నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలులో 30 తులాల బంగారు ఆభరణాలు కలిగి ఉన్న బ్యాగు కనిపించకపోవడంతో బాధితులు ఆరోజునే సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు లికిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీలను పరిశీలించిన రైల్వే పోలీసులు ఇద్దరు దొంగలు ఈ నేరానాకి పాల్పడినట్లు నిర్ధారణకు వచ్చారు. హరియాణకు చెందిన సుల్తాన్ (44) కూలి పనిచేస్తుంటాడు. తన స్నేహితుడు జోగిందర్ (35) (పరారీలో ఉన్నాడు) ఇద్దరు చరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడంది. నిందితుడు సుల్తాన్‌ను రైల్వే పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 30 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. జోగిందర్ కోసం రైల్వే పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే పోలీసులు

దండాలయ్యా.. 21 వేల గణపతులయ్యా

● వినాయక విగ్రహాల సేకరణలో శేఖర్ వరల్డ్ రికార్డ్

మారేడుపల్లి, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): చిన్నతనంలో గణపతి పండగొస్తే ఆ ఆనందమే వేరు. ముచ్చటగా అలంకరించి, ప్రేమగా పూజించి నిమజ్జనం చేస్తాం. పెరిగి పెద్దయ్యాక ఈ పనులకు స్వస్తి చెప్పేస్తాం. కానీ ఒకరు మాత్రం స్వస్తి చెప్పలేదు. వేల సంఖ్యలో వినాయక విగ్రహాలను సేకరిస్తూ తన ఇల్లు గణేష్ ప్రతిమల మ్యూజియంగా తీర్చిదిద్దుతున్నాడు. కంటోన్మెంట్ వెస్ట్ మారేడుపల్లికి చెందిన విశ్రాంత బ్యాంకు ఉద్యోగి పబిశెట్టి శేఖర్ తన 12వ ఏటా 1973 నుంచి వినాయకుడి ప్రతిమలను సేకరించడం ప్రారంభించాడు. లక్ష విగ్రహాల సేకరణ లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు. వెరైటీ విగ్రహం కనిపిస్తే చాలు అది ఆయన ఇంటికి చేరవలసిందే. బంగారం, వెండి, ఇత్తడి, అల్యూమినియం, మార్బుల్, క్రిస్టల్, చెక్క, రాతి, మట్టితో తయారుచేసిన విగ్రహాలు ఉన్నా యి. 51 ఏళ్లలో మొత్తం 39 దేశాల నుంచి 21,110 విభిన్నమైన గణపతి విగ్రహాలను సేకరించారు. వాటితో పాటు 19228 గణేశ్ పోస్ట్ కార్డులు, 14322 గణేశ్ ఫొటోలు, 1102 పెద్ద సైజు గల గణేశ్ ఫోటోలు, 252 గణేశ్ పుస్తకాలు 222 గణేశ్ కీ చైన్‌లు, 202 ఆడియో, వీడియో, క్యాసెట్స్ మొత్తం 56,438 గణేశ్ ప్రతిమలను సేకరించారు.



గణపతుల మ్యూజియంలో పబిశెట్టి శేఖర్

అద్భుతమైన వరల్డ్ రికార్డులు...

గణేశ్ విగ్రహాల సేకరణలో పబిశెట్టి శేఖర్ ఎన్నో వరల్డ్ రికార్డులు సొంతం చేసుకున్నారు. గిన్నీస్ వరల్డ్ రికార్డ్‌తో పాటు యూనిక్ వరల్డ్, అమేజింగ్ రికార్డ్, పబ్లిక్ రికార్డ్ హోల్డర్లు వచ్చాయి. ఇండికా ఆఫ్ రికార్డ్స్, ఎవరెస్ట్ వరల్డ్ రికార్డ్, గోల్డెన్ బుక్ ఆఫ్ రికార్డ్, మిరాకిల్ వరల్డ్ రికార్డ్‌లు సొంతం చేసుకున్నారు. గణపతుల సేకరణలో పబిశెట్టి శేఖర్ సాధించిన విజయాలకు 25 ఆగస్టు 2024లో కింగ్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, అదే విధంగా ఎక్సిక్యూజివ్ వరల్డ్ రికార్డ్‌ను ఆయన సొంతం చేసుకున్నారు.

ఇబ్రహీంపట్నం చెరువులో

మరో మృతదేహం లభ్యం



లావణ్య మృతదేహం



చెరువులో గాలిస్తున్న డీఆర్ఎఫ్ బృందం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 6: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో ఓ మహిళ తన పిల్లలను తోసేసి తానూ దూకిన ఘటనలో తల్లి మంగ, కుమారుడు శరత్ మృతదేహాలు గురువారం రాత్రి లభ్యం కాగా కుమార్తె ఒరుసు లావణ్య(18) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మృత్యువు నుంచి తప్పించుకున్న చిన్న కొడుకు

మంగ తన కూతురు లావణ్య, కుమారులు శరత్, విఘ్నేష్‌లతో కలిసి ఇబ్రహీంపట్నం చెరువు పెద్ద తూము వద్దకు చేరుకుంది. స్నానంచేసి వెళ్లిపోదామని చెప్పిన మంగ నీటి అంచున ఉన్న లావణ్య, శరత్, విఘ్నేష్‌లను చెరువులోకి తోసేసింది. అనంతరం తానూ దూకేసింది. అయితే తల్లి సహా కుమార్తె, పెద్ద కుమారుడు మృతి చెందగా చిన్న కుమారుడు విఘ్నేష్(5) మెట్ల సాయంతో ఒడ్డుకు చేరుకున్నాడు. గురువారం రాత్రి 7.30 గంటల సమయంలో విఘ్నేష్ ఏడుస్తూ కనిపించడంతో అతడిని చూసిన వారు పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడకు చేరుకున్న పోలీసులు, మున్సిపల్, ఫైర్ సిబ్బంది అదే రాత్రి మంగ, శరత్ మృతదేహాలను వెలికితీశారు.

లావణ్య పెళ్లి విషయంలో గొడవ

మంగ, తన భర్త కుమార్ ఇద్దరిదీ రెండో వివాహమే. కుమార్ మొదటి భార్యకు ముగ్గురు ఆడపిల్లలు కాగా.. మగబిడ్డ కోసం మంగను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు శరత్, విఘ్నేష్ ఉన్నారు. అప్పటికే మంగకు మరొకరితో వివాహమై కూతురు లావణ్యతో పాటు కుమారుడు ఉన్నాడు. అయితే మొదటి భర్త సంతానమైన లావణ్య పెళ్లి విషయంలో మంగ, కుమార్ బుధవారం రాత్రి గొడవ పడ్డారని.. కుమార్ కొట్టడంతో మనస్తాపానికి గురైన మంగ పిల్లలతో సహా అఘాయిత్యానికి పాల్పడినట్లు బంధువులు చెబుతున్నారు.

ముస్లిం మత గురువు హఠాన్మరణం

ముషీరాబాద్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన హుస్సేనియా మసీద్ సీనియర్ ఆధ్యాత్మిక మత గురువు సయ్యద్ అలీ కుందుమిరి సాహెబ్(87) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్నా ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే మోజంఖాన్, యువజన కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అరవింద్‌కుమార్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు సాహబ్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మండపాల వద్ద విద్యుత్ భద్రతా చర్యలు పాటించాలి

● టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): గణేశ్ మండపాలకు నిరంతరాయ విద్యుత్‌సరఫరా అందించాలని, మండపాల్లో భద్రత చర్యలు పాటించేలా నిర్వాహకులకు సూచించాలని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆపరేషన్స్ డైరెక్టర్ డా.నర్సింహులు, చీఫ్ ఇంజనీర్స్ పి.ఆనంద్, కె.సాయిబాబా, ఎస్ఈలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేశ్ మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ కల్పిస్తుందన్నారు. విద్యుత్‌సిబ్బంది, సెక్షన్ అధికారులు తమ పరిధిలో ఏర్పాటు చేసిన మండపాలను సందర్శించి, విద్యుత్ పరంగా ఎలాంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. మండపాల వద్ద విద్యుత్ భద్రతా చర్యలు పాటించాలన్నారు. శుక్రవారం రాత్రి ఖైరతాబాద్ మహాగణపతి వద్ద విద్యుత్‌శాఖ ఏర్పాట్లను సీఎండీ పరిశీలించారు. 11 రోజుల పాటు మహాగణపతి సమీప ప్రాంతాల్లో అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

సూచనలు ఇవే..

● 24 గంటలు అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడ మండపాలకు విద్యుత్ సరఫరా కనెక్షన్ కోసం సామాన్యులు స్తంభాలు ఎక్కరాదు. సంస్థ సిబ్బంది ద్వారానే విద్యుత్‌కనెక్షన్ తీసుకోవాలి.

● ఐఎస్ఐ మార్క్ కలిగిన ప్రామాణిక విద్యుత్‌వైర్లు మాత్రమే వాడాలి, ఎలాంటి జాయింట్ తీగలు వాడరాదు.

● లోడ్‌కు తగినట్లుగా కెపాసిటీ కలిగిన ఎంసీబీ తప్పనిసరిగా వాడితే ప్రమాదాల నుంచి రక్షణగా ఉంటుంది.

● విద్యుత్ వైరింగ్‌లో లోపాలు, లూజు కనెక్షన్లు ఉంటే వర్షాలు పడినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలుంటాయి. మండపనిర్వాహకులు రోజు వైరింగ్ తనిఖీ చేసుకోవాలి.

● విద్యుత్ లైన్లు తెగిపడితే, ఇతర అత్యవసర పరిస్థితుల్లో 1912/100, సమీప ఫ్యూజ్ ఆఫ్‌కాల్‌కు ఫోన్ చేసి విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.



అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

అశోక్ మృతికి తలసాని సంతాపం

పద్మారావునగర్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు మక్కల అశోక్ గురువారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. సీసీనగర్ డబుల్ బెడ్‌రూం సముదాయంలో నివసిస్తూ ఇటీవల మరణించిన శివ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కష్టం కలిగిన వారికి అన్ని వేళలా అండగా నిలుస్తానని అన్నారు.



గాంధీలో బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు, తలసాని, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తదితరులు

రాష్ట్రంలో అత్యాచారాలు పెరిగిపోతున్నాయి

● గాంధీలో ఆదివాసీ మహిళను పరామర్శించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

అడ్డగుట్ట, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అత్యాచార యత్నానికి గురైన గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆసిఫాబాద్‌కు చెందిన ఆదివాసి మహిళను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, తలసాని, సబిత ఇంద్రారెడ్డి, సునిత లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, ముఠా గోపాల్‌లు పరామర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. జైనూరు ఘటన అత్యంత పాశవికమని, హత్యలు, అత్యాచారాలు నిత్యకృత్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏకంగా కానిస్టేబుల్ మీద అత్యాచారం చేయడం దారుణమన్నారు. 9 నెలల కాంగ్రెస్ పాలనలో మహిళలపై 1900 అత్యాచారాలు జరిగాయని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మహిళా ఎమ్మెల్యేలు సబిత, సునీతా చెప్పారు. రుణమాఫీ కాలేదని రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని మల్లారెడ్డి విమర్శించారు.

అత్యాచారాలను కట్టడి చేయాలి

అడ్డగుట్ట, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ప్రభుత్వం కట్టడి చేయాలని ఎస్సీ ఎస్టీ కమిషన్ బక్కి వెంకటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆదివాసి మహిళను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాచారాలపై ప్రభుత్వం కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు.

మహాకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు

తిరుమలగిరి, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్‌లోని మహాకాళి దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి అలంకారం, అభిషేకం, అర్చణ ప్రత్యేక పూజలు దేవాలయం అధ్యక్షుడు మురళీ ముదిరాజ్ కుటుంబం, శ్రీపతి కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. అర్చకులు రామశర్మ అమ్మవారిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రతి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు మురళీ ముదిరాజ్ తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు

జేబీఎస్‌లో పార్కింగ్‌పై టెండర్లు రీకాల్ చేయాలి

మారేడుపల్లి, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని జూబ్లీ బస్ స్టాండ్‌లో ఉన్న పార్కింగ్ విషయంలో అధికారులు టెండర్ రీకాల్ చేయాలని బీజేపీ నాయకుడు జెట్టి ఉమేష్వర్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కంటోన్మెంట్ బోర్డు అధికారికి వినతిపత్రం అందజేస్తూ అందులో పొందుపరిచిన విషయాలను వెల్లడించారు. గతంలో జూబ్లీ బస్టాండ్‌లో ఖాళీగా ఉన్న స్థలాన్ని పార్కింగ్ కోసం మురుగన్ ఎంటర్‌ప్రైజెస్‌కు అనుమతులు మూడేళ్లు ఇచ్చారని తెలిపారు. ఇటీవల గడువు పూర్తయినా మరో మూడు నెలలు పొడిగించారు. అలాకాకుండా టెండర్ల ద్వారా తిరిగి అర్హులైన వారికి కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.



వంశీరామరాజు, రేలంగి నరసింహారావును సన్మానిస్తున్న ధర్మారావు

ధర్మారావు అభినందనీయుడు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో 63 సంవత్సరాలుగా కృషి చేస్తున్న ఇటిక్సా, ఫాస్ ఫిలిం సొసైటీల వ్యవస్థాపకుడు డా. కె. ధర్మారావును చిక్కడపల్లిలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ప్రముఖ సినీ నిర్మాత రామసత్యనారాయణ, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ.. దేశవిదేశాల్లో సాంస్కృతిక, కళా, సినిమా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్న ధర్మారావు అభినందనీయుడన్నారు. కార్యక్రమంలో భాగంగా ధర్మారావు వంశీ అధినేత రామరాజు, సీనియర్ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు, సీనియర్ జర్నలిస్ట్ రఫీ, డా. విజయకుమార్ తదితరులను సన్మానించారు. రసమయి రాము, కిన్నెర రఘురామ్, యువకళావాహిని లంక లక్ష్మీనారాయణ, ఆరాధన వెంకటరెడ్డి, లోకం కృష్ణయ్య, సినీగాయకులు నిహాల్, మిత్ర పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-CUM-VII ADDITIONAL DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR
M.V.O.P.NO.352 OF 2023

BETWEEN:
T.BHAGYAMMA .. PETITIONER
AND
KANDI PRAVEEN And others .. RESPONDENTS

To
R-1 KANDI PRAVEEN, S/o Kandi Narayana, Aged about 45 years, Occ: Private Employee, R/o 3-183, Dinsi Basti, Macha Bollaram, Hyderabad - 500 010 (Owner of Motor Cycle Bearing No. TS 10 FB 1821)
R-3 K.REVANTH, S/o Late K.Anjaiah, Aged about 22 years, Occ: Private Employee, R/o 3-183, Krishna Nagar, Macha Bollaram, Hyderabad - 500 010 (Owner of Motor Cycle Bearing No. TS 10 FB 1821)

NOTICE

The Petitioner herein had filed the above petition for compensation under Section 166 of the M.V.Act, 1989 and Rule 475/1B of A.P.M.V.Rules, 1989 against the Respondents which includes you. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above OP and the matter is posted to 10.09.2024 at 10.30 a.m. and therefore you may appear before this Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law.
Hence, this Notice.

[BY ORDER OF THE COURT]
Sd/-
G.RATHNAM REDDY,
Advocate,# 11-6-227, Pochamma Bagh, Beside GHMC Office, Saroornagar, Ranga Reddy District, Cell No.9912658614